

"సరోజా!"

సీతారామయ్యగారి కంఠం ఎండు టాకులా వణికింది.

నిండైన ఆయన విగ్రహం తుఫానులో చిక్కుకు పోయిన మర్రిచెట్టులా ఊగింది.

విశాలమైన ఆయన నుదుటి మీద ఏర్పడిన సమస్యల ముడతలు తెల్ల కాగితం మీద గీసిన సమాంతర రేఖల్లా ఉన్నాయి.

నల్లటి కళ్ళలో ఎర్రటి జీరలు చిందరవందరగా ఏర్పడ్డాయి.

కనురెప్పల క్రింద సమస్యలు సృష్టించిన నల్లటి చారికలు మరింత నల్లబడ్డాయి.

మధ్యాహ్నపు ఎండలో బడలిపోయిన ఎర్ర కలువ అయ్యాయి ఆయన చెక్కిళ్ళు.

ఉక్కు గుండులాంటి ఆయన మనస్సు సుడిగాలిలో చిక్కుకున్న రబ్బరు బెలూనులా మాడిపోయింది.

మనస్సంతా ఆలోచనలతో అల్లకల్లోలమైంది.

భూత, భవిష్యత్, వర్తమానాలు ఆయన మనస్సు చుట్టూ గిర్రున తిరిగాయి.

ఏమీ చెప్పలేని నిస్సత్తువ.

ఏమీ చేయలేని నిస్సహాయత.

ఏమీ నిర్ణయించలేని సందిగ్ధత.

చేతిలో ఉన్న ఉత్తరం పాల సముద్ర మథనానికి సిద్ధపడిన కవ్వంలా గాలికి ఊగుతోంది.

గోడను ఆసరాగా తీసుకుని వెను

వాలుకుర్చీలో కూర్చున్నారు సీతారామయ్యగారు.

కొన్ని క్షణాలపాటు కళ్ళు మూసుకొని అరిచేతుల్లో ముఖాన్ని దాచుకొని ఆలోచనల్లో నిమగ్నమయ్యారు.

పోస్ట్‌మన్ కేక వినిపించగానే తనెంతో ఆశతో బయటికి వెళ్ళాడు.

ఎందుకు?

తన ప్రాణానికంటె మిన్నగా పెంచుకొన్న శేఖర్ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందేమోనన్న ఆశతో.

తను ఎన్ని ఉత్తరాలు వ్రాసినా, గత ఆరు నెలల నుంచీ వాడి దగ్గర్నుంచి సమాధానం రానందుకుగాను మనస్సులో ఏర్పడిన బెంగ తీరుతుందేమోనన్న ఆశతో!

కాని, పోస్ట్‌మన్ అందించిన కవరును చూడగానే తన ఉత్సాహమంతా నీరుకారిపోయింది.

అది ఫారిన్ నుంచి వచ్చిన కవరు కాదు!

యాంత్రికంగా కవరును అందుకొని ఉత్తరాన్ని బయటకు తీశాడు.

ఆ ఉత్తరంలోని సారాంశం . . .

తన హృదయాన్ని చిలుకగా మార్చి పంజరంలో బంధించి వేసింది.

ఏదో బరువైన కుంపటిని తన శిరస్సు మీద బలవంతాన పెట్టింది.

అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది.

ఏదైతే తన కళ్ళ ముందు జరుగకూడదని భగవంతుణ్ణి ఇంతకాలం ప్రార్థించాడో అదే ఈ నాడు జరిగిపోయింది.

తన మనస్సుకు పగ్గం వేసి తనను శక్తిహీనుణ్ణి చేస్తోంది.

ఇప్పుడు తనేం చేయాలి?

ఆ ఊరు వెళ్ళి తను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం జరుపుకు రావాలా? లేక, ఏ నిర్ణయం తీసుకోకుండా తటస్థంగా ఉండిపోయి మరింత పాపాన్ని మూట కట్టుకోవాలా?

ఏమిటి కర్తవ్యం?

ఇంతకాలం ఏ వంశ ప్రతిష్ఠ కోసం తను జీవితంతో చెలగాట మాడాడో ఆ వంశం తనతో అంతం కావలసిందేనా?

## గుడిసేవ సుందరరామయ్య

వీల్లేదు ... తన వంశం నిలవాలి ... తను చేసిన తప్పును సరిదిద్దుకొని తన వంశాన్ని నిలుపుకోవాలి... తన ఒక్కడి స్వార్థత్వం వలన వంశం అంతరించటానికి వీల్లేదు.

సీతారామయ్యగారికి నూతన శక్తి వచ్చినట్లయింది.

హృదయం తేలికపడింది. స్వేచ్ఛగా గాలి పీల్చుకొన్నారు.

ఉత్సాహంగా లేచి నిలబడ్డారు.

తను ఊరికి వెళుతున్నానని నౌకరుకు చెప్పి, మరో పావు గంటకు రైల్వే స్టేషన్ చేరుకొన్నారు.

టిక్కెట్టు కొనుక్కొని స్టేషన్‌లోకి అడుగు పెట్టగానే ప్లాట్‌ఫారమ్ మీద బయలుదేరటానికి సిద్ధంగా ఉన్న ట్రెయిన్ కనిపించింది.


సీతారామయ్యగారు నడక వేగాన్ని హెచ్చించి ట్రెయిన్ వేపు నడవసాగారు.

అంతలో ఆయనకు ఎదురుగా పరిగెత్తుకు వస్తున్న ఓ కుర్రాడు కాలు జారి ప్లాట్‌ఫారమ్ మీద తక్కునపడిపోయాడు. సీతారామయ్యగారు ఆ కుర్రాడి రెక్క పుచ్చుకుని నెమ్మదిగా లేవదీశారు.

"జాగ్రత్తగా నడవాలి బాబూ! దెబ్బలేమైనా తగిలాయా?" భుజం తట్టి ఆప్యాయంగా ప్రశ్నించారు.

ఆ కుర్రాడు మారుమాట్లాడకుండా శరీరానికి అంటుకొన్న దుమ్మును దులుపుకొన్నాడు.

"పట్టుకోండి ... ఆ కుర్రాణ్ణి పట్టుకోండి ..." అంటూ ఇద్దరు వ్యక్తులు దగ్గరగా అరుస్తూ పరుగెత్తుకు రావటం చూసి సీతారామయ్యగారిని విడిపించుకొని కుర్రాడు తూనీగలా పరుగు తీశాడు. వాడు వెళ్ళినవైపే చూశారు సీతారామయ్యగారు. పట్టాలు దాటి శరవేగంతో పరుగులు తీశాడు వాడు.



"ఆ కుర్రాణ్ణి ఎందుకు వదిలి పెట్టారు?" ఇద్దరు వ్యక్తులూ ఏక కంఠంతో సీతారామయ్యగారిని ప్రశ్నించారు.

"ఏమైంది?"

"ఇంకేం కావాలి! మా వాడి పర్సు కొట్టేశాడా దొంగవెధవ!" అన్నాడు నల్ల కళ్ళద్దాల వ్యక్తి.

"వాడు దొంగతనం చేశాడా?" ఆశ్చర్యంగా అడిగారు సీతారామయ్యగారు.

"అబద్ధమంటారా?"

"అబ్బే! అది కాదు నా ఉద్దేశ్యం ... ఆ వయస్సులో ..."

"దొంగతనానికి వయస్సుతో నిమిత్తం ఏముంది?" చిరాకుగా అన్నాడు నల్ల కళ్ళద్దాల వ్యక్తి.

అంతలో రైలు కూత వేసింది.

"వెధవ! చేయిజారి పోయాడు. రైలు కూడా కదలబోతూంది!" అనుకొంటూ వాళ్ళిద్దరూ ట్రెయిన్ వైపు పడివారు.

సీతారామయ్యగారు కూడా వాళ్ళవెనకే పడిచి రైలెక్కారు.

మెల్లగా లోపమూస్తూ రైలు కదిలింది.

కంపార్టుమెంటులో జనం పలచగా ఉన్నారు.

కిటికీ ప్రక్కనే ఉన్న సీట్లో సీతారామయ్యగారు కూర్చున్నారు.

ఆయనకు కొంచెం అవతల పర్సు పోగొట్టుకొన్న వ్యక్తి, నల్ల కళ్ళద్దాల వ్యక్తి కూర్చుని ఉన్నారు.

"ఏం బాబూ! పర్సు దొరికిందా?" అని పరామర్శించాడు ఓ ముసలాయన.

"ఏటండీ! దొరికినట్టే దొరికి పారిపోయాడు దొంగ వెధవ!" కసిగా అన్నాడు పర్సు పోగొట్టుకున్న వ్యక్తి.

"ఏమాత్రం ఉందేమిటి అందులో?" ముసలాయన ప్రశ్నించాడు.

"పదిహేను రూపాయలు!"

"ఇంకా నయం! తక్కువ డబ్బే! అదృష్టవంతుడివి!" ఓ బట్టతలాయన అన్నాడు.

"ఏం అదృష్టమండీ! ఈవేళ ఎవడి ముఖం చూశానో?" పర్సు పోగొట్టుకున్న వ్యక్తి చిరాకు పడ్డాడు.

"అస లిదంతా ఆ పెద్దమనిషివలన జరిగింది. ఆయన వాణ్ణి పట్టుకొని ఉంటే డబ్బు పోయేది కాదు" అంటూ సీతారామయ్యగారిని చూపించాడు నల్ల కళ్ళద్దాల వ్యక్తి.

సీతారామయ్యగారు అంతా గమని స్తూనే ఉన్నారు. పర్సు పోగొట్టుకొన్న వ్యక్తిని అనునయిస్తూ, విస్మరించి, పారిపోతున్న కుర్రాణ్ణి పట్టుకోనందుకు తన పైన నిందవేస్తున్న నల్ల కళ్ళద్దాల వ్యక్తి ధోరణికి విస్తుపోయాడు.

"నిజంగా నా వలనే మీరు డబ్బు పోగొట్టుకున్నారని భావిస్తే ఆ పదిహేను వే నిస్తాను" అంటూ జేబులోంచి డబ్బు తీసి పర్సు పోగొట్టుకున్న వ్యక్తికి అందించ బోయారు సీతారామయ్యగారు.

ఆ హఠాత్పరిణామానికి కంపార్టుమెంటులోని వాళ్ళంతా ఆశ్చర్యపోయారు.

పర్సు పోగొట్టుకొన్న వ్యక్తి తెల్ల ముఖం వేశాడు.

నల్ల కళ్ళద్దాల వ్యక్తి మాత్రం గుటకలు మ్రింగుతూ—"నా ఉద్దేశం మీ దగ్గర డబ్బు తీసుకోవాలని కాదండీ. తప్పు చేసిన వాడు శిక్ష పొందకుండా తప్పించుకున్నాడనే బాధతో అలా అన్నాను!" అని సమర్థించుకొన్నాడు.

"నీ పిచ్చి కాకపోతే ఈ కాలంలో తప్పు చేసిన వాళ్ళంతా శిక్షను పొందుతున్నా రంటావా?" ముసలాయన నవ్వుతూ అన్నాడు.

"తప్పకుండా! లేకపోతే మన దేశం అల్లకల్లోల మవుతుంది. అస లిలాంటి కుర్రాళ్ళను చిన్న వయస్సులోనే కంట్రోల్ చేయాలండీ!" నల్ల కళ్ళద్దాల వ్యక్తి ఆవేశంగా అన్నాడు.

"దిక్కూ దివాణం లేని వాళ్ళే ఇలాంటి పనులకు సిద్ధపడతారు. తల్లిదండ్రులు లేకపోయేసరికి ఏమున్నదండీ? చెడు తిరుగుళ్ళకు అలవాటు పడి ఇలా దొంగలుగాను, రౌడీలుగాను, హంతకులుగాను తయారై సంఘానికి చీడపురుగు లవుతున్నారు." బట్టతలాయన చుట్టకాల్చుకొంటూ అన్నాడు.

ఆ మాటలు సీతారామయ్య గారి గుండెలోంచి ఈటెల్లా దూసుకు పోయాయి.

చేతిలో ఉన్న డబ్బు జేబులో పెట్టుకొన్నారు.

కండువాతో ముఖానికి పట్టిన చెమటను తుడుచుకొని శూన్యంలోకి చూశారు.

బయటినుంచి ఈదురుగాలివీస్తోంది.

చెట్లు, చేమలు, ఎలక్ట్రిక్ స్తంభాలు హడావిడిగా పరుగులు తీస్తున్నాయి.

సీతారామయ్యగారి మనస్సు వాటితో పాటే పడింది.

మెల్లగా కళ్ళు మూసుకున్నారు.

సరిగ్గా పదేళ్ళ క్రితం తను ఈ రైల్లో ప్రయాణం చేశాడు.

ఆ నాటి ప్రయాణానికి, ఈ నాటి ప్రయాణానికి ఎంత తేడా!

కాలంలో మార్పు.

పరిస్థితుల్లో తేడా.



రూపవైవిధ్యం
ఫోటో—లవర్ ఆఫ్ పీపుల్ (ఏలూరు)

---

అంతరంగంలో అంతరం.
అష్టాంలో భేదం.
ఉద్రేకాన్ని, ఉద్వేగాన్ని మనస్సులోనే దాచుకొని ప్రయాణాన్ని సాగించి కార్య సిద్ధికై ఆర్తిగా ఎటించి, అర్థర్థించిన పంచాంగం నాటి సీతారామయ్య.
దుఃఖాన్ని, బాధల్ని మనస్సులో పెంచుకుని ప్రయాణం చేస్తూ, బాధ్యతలను

గుర్తించి, కర్తవ్యాన్ని విస్మరించలేదు నిజంగా నేనూ మానవుడు కాదే సీతారామయ్య!

పంతం పట్టే వయసులో, పరువు ప్రతిష్ఠలను ఆ నాడు తను కాదు!

మానవత్వానికి, కర్తవ్యానికి విలువ ఈ నాడు తను ఇచ్చే!

ఆ నాడు ద్వేషం, అహంకారం తన హృదయాన్ని పట్టివేశాయి.

ఈ నాడు ప్రేమ, అనురాగం తన హృదయాన్ని కట్టివేశాయి.

వేలకొలది వంతవైన భవిష్యత్తుకు బంగారు పునాదులు వేయాలనే తపన తనది ఆ నాడు!

కాఠిన్య హృదయంలో ఉద్భవించిన మమతానుబంధాలు క్షణికమైనవి కాకూడదనే తపన ఈ నాడు!

ఒకరి జీవితంలో వెన్నెల కురిపించటానికి మరొకరి జీవితాన్ని అంధకారమయం చేయటానికి కూడా వెనకాడని కర్కశత్వం నాటిది!

గమ్యం తెలియక చీకటిలో ప్రయాణం చేస్తున్న పాంథునికి వెలుగు బాట చూపెట్టటానికి సిద్ధపడిన కరుణార్ద్రత నేటిది!

కన్న తండ్రి మాటను ఎదురు చెప్పిన కొడుకును ఆ నాడు ప్రపంచించినందుకు క్రూరంగా బాగుంది నాటి పితృ హృదయం!

కన్న కొడుకు దగ్గరనుంచి కనీసం ఉత్తరాన్ని కూడా పొందలేని నిర్భాగ్యస్థితి కలిగినందుకు క్రుంగిపోతూంది నేటి పేద హృదయం!

శేఖర్ గుర్తుకు రాగానే సీతారామయ్య గారి మనస్సు ఆర్ద్రమైంది.

శేఖర్ తనకు ఒక్కగా నొక్క బిడ్డ! తన వంశోద్ధారకుడు వాడే! ఐదేళ్ళ వయస్సులో తల్లిని పోగొట్టుకొన్న ఆ అభాగ్యునికి తల్లీ,తండ్రీ అన్నీ తనే అయ్యాడు. చిన్నప్పటినుంచి వాడి మీద ఎనలేని ప్రేమను, వాత్సల్యాన్ని పెంచుకొని వాడి పురోభివృద్ధికోసం తను కృషిచేశాడు. వాడి మీద ఆశలు పెంచుకొని ఎన్నో ఊహాసౌధాలు నిర్మించుకొన్నాడు.

తన ఊహలన్నీ కల్లలు కాలేదు. అను కొన్నది చాలావరకు సాధించగలిగాడు తను!

శేఖర్ విదేశాలకు వెళ్ళటానికి డబ్బు తక్కువైతే పెద్దలు సంపాదించిపెట్టిన మాగాణి భూమిని సగం అమ్మేసి వాడి అభీష్టాన్ని నెరవేర్చాడు. వాడి సౌఖ్యం కోసం ఆత్మను వంచించుకొని జీవితంలో అబద్ధాలు చెప్పటం, అన్యాయాలు చేయటం నేర్చుకొన్నాడు తను!

వాడి భవిష్యత్తుకోసం స్వార్థపరుడుగా వ్యవహరించి ఓ నిండు జీవితాన్ని హరించాడు తను!

వాడి సుఖంకోసం ఓ గొప్పింటి అమ్మాయిని తెచ్చి వైభవోపేతంగా వివాహం చేశాడు తను!

కాని ... కాని ... ఎంత చేసినా ... ఏదో తీరని అసంతృప్తి, నెరవేరని ఆశలు తనను వెక్కిరిస్తూనే ఉన్నాయి. అసలు మానవుని మనస్సుకు సంతృప్తి లేదు. అది అక్షయపాత్ర లాంటిది. భూమ్మీద పుట్టిన క్షణం మొదలుకొని ఆఖరి శ్వాస విడిచే క్షణం వరకు ఏవేవో కోర్కెలు ఉద్భవిస్తూనే ఉంటాయి. ఇదొక వెతలేని సమస్య...

తనలాగే శేఖర్ కూడా మనస్సులో ఎంత క్షోభ పడుతున్నాడో?

'తాతయ్యా — అని పసివాడితో ముద్దుగా పిలిపించుకొనే అదృష్టాన్ని మీ కీ జన్మలో కలిగించలేని నిస్సహాయుణ్ని నేను!'

ఆరు నెలల క్రితం శేఖర్ వ్రాసిన ఉత్తరంలోని వాక్యాలు ఇంకా తన మనోఫలకం మీద నుంచి చెరిగి పోలేదు.

శేఖర్ అలా వ్రాయటానికి గల కారణం తనకు అర్థంకాలేదు.

వాడు తనకు తెలియకుండా ఏదో విషయం రహస్యంగా ఉంచి ఎంతో మథనపడుతున్నాడని అనుమానించాడు తను.

చివరకు తన అనుమానం నిజమైంది.

వాడి మామగారు జరిగిన విషయాన్ని చెప్పేసరికి తన హృదయం వేయి ముక్క లైంది. ఉన్నతమైన శిఖరం మీద నుంచి అంటని అగాధంలోకి త్రోసిన ట్లయింది. భూమ్యాకాశాలు ఏకమై తనను ఐక్యం చేసుకోటానికి ప్రయత్నించిన ట్లనిపించింది.

మోటారు ఆక్సిడెంట్ కారణంగా తన శేఖర్ సాంసారిక జీవితానికి అనర్హుడయ్యాడన్న నగ్న సత్యం తనను నిలువెల్లా దహించి వేసింది.

ఆ రోజు తనెంతో విలపించాడు.

చిన్నప్పటినుంచీ తను చేతులారా పెంచుకొన్న మొక్క పెద్ద వృక్షమై ఫల పుష్పాలతో నిండుగా విరాజిల్లు తున్న తరుణంలో ఎవరో గొడ్డలితో నరికివేసిన ట్లయింది.

విధి ఆడుతున్న చదరంగంలో శేఖర్ కూడా పావులా మారిపోయాడా?

తను చేసిన పాపానికి ప్రతిఫలంగా శేఖర్ జీవితంలో దుఃఖం చెలరేగిందా? ఒక ప్రక్క శేఖర్‌కు జరిగిన అన్యాయానికి కుములిపోతుంటే, మరో ప్రక్క ఈ దుర్వార్త ఏమిటి?

హే భగవాన్! ఏమి ఈ పరీక్ష? అన్ని అనర్థాలకు కారణభూతుడైన తను రామువులకు ముఖం ఎలా చూపించ గలడు?

• • •

రిక్షాలోంచి దిగుతూన్న సీతా రామయ్యగారి వైపు ఆశ్చర్యంగా చూశారు ఆ వీధిలోని వాళ్ళంతా.

సీతారామయ్యగారు తల ఎత్తి చుట్టూ చూశారు.

లోగడ తను వచ్చినప్పుడు ఆ వీధిలో ఎటు చూసినా పూరి పాకలే కనిపించేవి. రోడ్డు నిండా గతుకు లుండేవి. విద్యుద్దీపా లుండేవి కావు. పరిసరాలన్నీ అపరి శుభ్రంగా ఉండేవి. కాని, ఇప్పుడు చాలా మార్పు కనిపిస్తూంది. పూరి పాక లను తొలగించి అక్కడక్కడ పెంకుటిళ్ళు వెలిశాయి. చక్కని రోడ్డు ఏర్పడింది. కరెంటు దీపాలు వచ్చాయి. పరిసరాలన్నీ శుభ్రంగా, శుచిగా ఉన్నాయి. మెల్లగా అడుగులు వేసి ఓ ఇంటిముందాగారు.

ఆ వీధి ఎంత అభివృద్ధి సాధించినా, ఆయన కంటికి కనిపించే ఇల్లు మాత్రం ఏ విధంగానూ అభివృద్ధి సాధించలేదు సరికదా శిథిలావస్థలో ఉంది. దేవుని తుది పిలుపుకోసం ఎదురు చూస్తున్న జీవిలా ఏ క్షణంలోనైనా కూలిపోవటానికి సిద్ధంగా ఉంది. ఇక ఆ ఇంటి గోడల సంగతి చెప్ప నక్కర్లేదు. మండు వేసవి కాలంలో మాగాణి భూమిలో ఏర్పడిన బీటలు ఆ గోడల నిండా కోకొల్లలు. చేతితో తాకితే చాలు, ఏ ముక్క కా ముక్క ఊడి వచ్చేట్లుంది.

గుమ్మం దగ్గరకు వెళ్ళి, "రాఘవులూ!" అని పిలిచారు సీతారామయ్యగారు.

"ఎవరూ?" అంటూ మంచంమీద నుంచి ఓ ప్రక్కకు తిరిగి గుమ్మంవైపు చూశాడు రాఘవులు.

ఎదురుగా సీతారామయ్యగారి గంభీర మైన విగ్రహం కనిపించింది.

అంతే!

అతనిలో ఏదో నవ చైతన్యం వచ్చిన ట్లయింది.

తన ఇష్ట దైవం ప్రత్యక్షమైనప్పుడు భక్తుడు ఎలా తన్మయత్వం చెందుతాడో అటువంటి పారవశ్యం అతని కళ్ళలో మెరుపులా మెరిసింది. అమాంతంగా లేచి వెళ్ళి ఆయనకు పాదాభివందనం చేయా లనుకొన్నాడు. చటుక్కున లేవ బోయాడు కాని, అంతలోనే శరీరం అశక్తతను తెలియజేసింది.

పొంగి పొంగులా అతని ఉత్సాహం చల్లారిపోయింది.

"రండి, బాబుగారూ ... లోపలకు రండి ..." అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు.

సీతారామయ్యగారు గుమ్మం దగ్గర కి మెల్లగా తల వంచి లోపలకి ప్రవేశించారు.

రాఘవులు శక్తి నంతా కూడగట్టు కొని మంచం మీద నుంచి లేవబోయాడు కాని, ప్రయత్నం ఫలించలేదు.

సీతారామయ్యగారు మెల్లగా రెక్క పుచ్చుకొని కూర్చోబెట్టారు.

"అలా ముక్కాలి పీటమీద కూర్చోండి, బాబూ!" ఆయాసపడుతూ అన్నాడు.

దూరంగా ఉన్న ముక్కాలిపీటను మంచం దగ్గరకు లాక్కొని సీతారామయ్య గారు కూర్చున్నారు.

"బాబుగారూ ... నా సరోజ ... నన్ను వదిలి వెళ్ళిపోయింది, బాబూ" అంటూ రాఘవులు చిన్న పిల్లవాడిలా ఏడ్చాడు.

తన కళ్ళ ముందే బిడ్డలు చనిపోయి నప్పుడు కన్న హృదయం అనుభవించే క్షోభ, దుఃఖం రాఘవులు గొంతులోనూ, ముఖంలోనూ ప్రస్ఫుట మయ్యాయి.

"ఆ మాయదారి దేవుడికి నా మీద కనికరం లేదు, బాబూ! నా కాళ్ళు, చేతులు పడిపో ... నా కళ్ళ ముందే నా బంగారు తల్లిని తీసుకుపోయాడు." రాఘ వులు కంఠంలో శోకం కట్టలు తెంచు కొని ప్రవహించే వాహినిలా విజృంభిం చింది.

సీతారామయ్యగారికి ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు.

"వాది ముందునుంచీ దరిద్రపు జన్మే, బాబుగారూ! జీవితంలో అడుగడుగునా దెబ్బలు తిన్నాను ... నా బొందిలో ప్రాణం పోయేవరకు నా కీ బాధలు తప్పేట్టు లేవు, బాబుగారూ!"

"రాఘవులూ! మనం మానవ మాత్రులం. విధి చేతిలో కీలుబొమ్మలం. మనం అనుకున్న వన్నీ ఒక్కొక్కప్పుడు జరగవు. మనం అనుకోని వెన్నో ఒక్కొ కప్పుడు జరుగుతూ ఉంటాయి." ఓదా ర్పుగా అన్నారు సీతారామయ్యగారు.

"నిజమే, బాబుగారూ! నా సరోజమ్మ నా కంటె ముందుగా పోతాదని నే ననుకోలేదు. దాని జీవితం ఏ నాడో

(తరువాయి 39 వ పేజీలో)

## గాజు పెంకు

( 36 వ పేజీ తరువాయి )

చీకటి అయింది. పసి బిడ్డ నా పక్కన తిరుగుతుంటేనే నాకు తృప్తిగా ఉండేది. ఇప్పుడా అదృష్టం కూడా లేదు. బాబుగారూ! నేను రాయించిన ఉత్తరం తమరికి అందిందా? ..." ఆలా అడిగాడు రాఘవులు.

"ఆ ఉత్తరం వచ్చేవరకు సరోజ పోయిన విషయం నాకు తెలియదు, రాఘవులూ!" తల వంచుకొనే సమాధాన మిచ్చారు.

"నా పరిస్థితి ఏమీ బాగోలేదు, బాబుగారూ! నా కొడుకులంతా ఎవరి కాడు ఇల్లు కట్టుకొని విడిపోయ్యారు. నన్ను, సరోజను, దాని బిడ్డను ఈ ఇంట్లో వదలి పోయారు. రెక్కల కష్టంతో సరోజమ్మే పోషించింది మమ్మల్ని. సరోజ పోయినకాణ్ణుంచీ నా పెద్ద కొడుకే నాకు, మనవడికి అన్నం పెడుతున్నాడు. నా సంగతెలా ఉన్నా మనవడి గురించే నా దిగులు, బాబుగారూ! ఆడి చేతిని నా చేతుల్లో పెట్టి కళ్ళు మూసింది నా బిడ్డ ..." కూతురు గుర్తుకు రాగానే రాఘవులు వెక్కి వెక్కి ఏడ్చాడు.

సీతారామయ్యగారి హృదయం ద్రవించింది.

"సొంత తండ్రినే వెళ్ళగొట్టినోళ్ళు తోబుట్టువు కొడుకుని ఆదుకుంటారనే నమ్మకం ఏ కోశానా లేక తమరికి ఉత్తరం రాయించాను, బాబుగారూ! ఒకప్పుడు తమ రొచ్చి వంశ మర్యాదలు నిలబెట్టమని నా చేతులు పట్టుకొని ఓ కోరిక కోరారు. ఏ కన్నతండ్రీ కూడా అలాంటి కోరిక ఒప్పుకొని కన్న కూతురి జీవితం నాశనం చేయటానికి ఒప్పుకోడు. కాని ... సరోజమ్మ ... దేవత! జరిగిన దానికి తన తండ్రే కారణమనుకొని మీ మాటకు ఎదురు చెప్పలేక తన జీవితాన్నే బలి ఇచ్చింది, బాబుగారూ ..."

సరోజ రూపం గుర్తుకు రాగానే సీతారామయ్యగారి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

శేఖర్ ఆ ఊళ్ళో చదువుకొన్న రోజులు ... హద్దు మీరిన అతని ప్రవర్తన ... తన మందలింపులు ... అన్నీ మసక మసకగా గుర్తుకు వచ్చాయి.

"అదుగో, బాబూ! వాసు వొచ్చాడు" అని రాఘవులు అనగానే సీతారామయ్యగారు కళ్ళు తుడుచుకొని గుమ్మంవైపు చూశారు.

లోపలికి రాబోయిన వాసు సీతారామయ్యగారిని చూడగానే ఠక్కున ఆగిపోయాడు.

ఎర్రటి పెదవులు, పల్చటి ఉంగరాల జుట్టు, గుండ్రటి కళ్ళు, గులాబి రంగు చెక్కిళ్ళు, పలుచటి పెదాలు — చిన్నప్పటి శేఖర్ రూపాన్ని గుర్తుచేశాయి సీతారామయ్యగారికి.

పున్నమినాటి చంద్రుని అందుకోవాలని ఉవ్వెత్తున లేచే సముద్రుని కెరటాల్లా సీతారామయ్యగారి హృదయంలో ఆప్యాయతానురాగాలు ఉవ్వెత్తున లేచాయి.

"రా, బాబూ!" అని పిలిచారు.

వాసు బిడియపడుతూ రాఘవులు వైపు చూశాడు.

"వెళ్ళు, బాబూ, తాతయ్యగారు పిలుస్తున్నారు ..." అన్నాడు రాఘవులు ఆనందోత్సాహంతో.

మెల్లగా అడుగులు వేసుకొంటూ సీతారామయ్యగారి దగ్గరకు వెళ్ళాడు వాసు.

ఆయన సంతోషాన్ని పట్టలేక వాసును దగ్గరకు తీసుకొని ఆప్యాయంగా హృదయానికి హత్తుకొన్నారు.

ఆ సన్నివేశం చూసి రాఘవులు కళ్ళలోంచి ఆనందబాష్పాలు రాలాయి.

* * *

(రైలు రావటానికి ఇంకా వ్యవధి ఉండటం తెలుసుకొని సీతారామయ్యగారు వాసును తీసుకొని ప్లాట్‌ఫారం మీదికి వెళ్ళారు. స్టేషన్ చూడటానికి చిన్నదే అయినప్పటికీ, ప్లాట్‌ఫాం మాత్రం విశాలంగా, చాలా పొడవుగా ఉంది.

ఇద్దరూ వెళ్ళి ఓ సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు.

రైలు పట్టాలకు అవతల ఉన్న పచ్చటి వరి చేలు ఆ సాయంకాలపు నీరెండలో పసిడి వెలుగులను విరజిమ్ముతున్నాయి.

చేల గట్లవెంట ఉన్న మొగలి పొదల్లోంచి మధుర పరిమళాన్ని మోసుకొస్తున్నాయి పిల్లగాలులు.



ముదిమి

ఫోటో—డి. సురేంద్రరెడ్డి ( మెదక్ )

వాసు పట్టాల మీద నిలబడి ఉన్న గూడ్సు పెట్టెల వైపు చూస్తూండిపోయాడు. ప్లాట్‌ఫారం చివరన దృష్టి సారించిన సీతారామయ్యగారికి ఇద్దరు కుర్రాళ్ళు కనిపించారు. వాళ్ళలో ఒకడి చేతిలో గోనె సంచీ వ్రేలాడుతూంది. మరొకడు ట్యూబ్ లైట్లు అమర్చిన గాజు డోమ్ వైపు పరీక్షగా చూస్తున్నాడు. వాడంత పరీక్షగా ఎందుకు చూస్తున్నాడో సీతారామయ్యగారికి అర్థం కాలేదు. వాడు రెండు క్షణాలాగి గోనె సంచీ పట్టుకొన్న వాడి చెవిలో ఏదో చెప్పాడు. వాడలా చెప్పగానే చుట్టూ ఓ సారి పరికించి చూశాడు. ఇద్దరూ కాస్సేపు నేలమీద దేనికోసమో వెదకసాగారు.

"తాతయ్యగారూ!" అన్న వాసు పిలుపు సీతారామయ్యగారికి వినిపించలేదు.

వాసు సీతారామయ్యగారి వైపు చూశాడు. ఆయన ఏదో దృశ్యాన్ని ఏకాగ్రతతో చూస్తున్నారని గ్రహించి వాసు ఆయన చూసిన దిక్కే చూశాడు.

అక్కడ గాజు పెంకులు ఏరుకుంటున్న కుర్రాళ్ళు కనిపించారు.

"తాతయ్యగారూ ..." అని మళ్ళీ పిలిచాడు వాసు.

"ఏం, బాబూ ..." అన్నారు పరధ్యానంగా.

"ఆళ్ళేం చేస్తున్నారు?" కుర్రాళ్ళను చూపిస్తూ అడిగాడు.

"గాజు పెంకులు ఏరుకుంటున్నారు."

"ఎందుకు?"

"అవి అక్కడ ఉంటే ఎవరి కాళ్ళకైనా గుచ్చుకొని గాయాలు అవుతాయి, బాబూ! వాటిని ప్రోగు చేసి సంచీలో వేసుకొని తీసుకెళతారు."

"ఎక్కడికి?" అమాయకంగా అడిగాడు వాసు.

"మళ్ళీ ఫ్యాక్టరీకి తీసుకెళ్ళి అందమైన గాజు పాత్రలు తయారు చేస్తారు, బాబూ!"

"అలాగా!" అన్నాడు వాసు, విషయమంతా తనకు అర్థమైనట్లుగా.

'ఇంకా నయం! ఆ కుర్రాడు కంకర రాయి పెట్టి డోమ్‌ను పగల గొట్టే దృశ్యాన్ని వాసు చూడలేదు. చూసి ఉంటే తప్పకుండా ప్రశ్నించే వాడే— తాతయ్యా, ఆ అద్దాన్ని ఎందుకు పగల గొట్టాడని? ఆ ప్రశ్న వేస్తే తను ఏం సమాధానం చెప్పేవాడు?' మనస్సులోనే అనుకొంటూ సీతారామయ్యగారు కండువాతో కళ్ళు తుడుచుకొన్నారు. ★